## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకీలోని తన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంక్షేమ పథకాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ పథకాలు ఎంతో ప్రయోజనకరమైనవని అన్నారు. ఈ పథకాల వల్ల వేలాది కుటుంబాలకు లబ్ధిచేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రఫత్‌హుస్సేన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

## బ్రోచర్ ఆవిష్కరణ


బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాకేశ్ తివారీ, ఆదర్ల మహేశ్ తదితరులు

గౌలిపురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని నల్ల పోచమ్మ ఆలయ బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను గురువారం ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షుడు రాకేశ్ తివారీ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, ప్రధాన కార్యదర్శి జి.పి.సురేశ్ కుమార్, ఉపాధ్యక్షులు డొంకి యాదగిరి, కుమార్, రాంమూర్తి, కె.ప్రభాకర్, ఎస్.చంద్రశేఖర్, కె.దేవేందర్, పుప్పాల మధుసూదన్ రావు, ఎల్.రమేశ్, ఎం.రఘుకాంత్, జి.రాజు పంతులు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## జగదాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ


పట్టు వస్త్రాలు, ఒడిబియ్యంతో బయలుదేరిన ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేషం గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి, మాజీ కార్పొరేటర్లు పాశం సురేందర్, ఆలే జితేంద్ర, ఉపాధ్యక్షులు మామిడి కృష్ణ, పాల్గొన్నారు.

## బస్తీల్లో ఫాగింగ్ చేయండి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది బస్తీలోని చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల వల్ల డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీల్లో వారానికి రెండుసార్లు అయినా ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బస్తీల్లో ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

## డమ్మీనోట్లతో మోసం చేస్తున్న ఇద్దరి అరెస్టు

జియాగూడ: డమ్మీ నోట్లతో అమాయకులను మోసం చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన ఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, మంగళ్‌హాట్ అదనపు ఇన్‌స్పెక్టర్ పి.మహేందర్ తో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని అమరావతి ప్రాంతానికి చెందిన వసీముద్దీన్, హైదరాబాద్ వాట్టేపల్లి ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఆజం అలీ ఇద్దరు స్నేహితులు. ఆటోలు నడుపుతుంటారు. మద్యానికి బానిసైన ఇద్దరు అక్రమంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించి అమాయకులను మోసం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల చార్మినార్ ప్రాంతంలోని ఓ స్టేషనరీ షాప్‌లో చిన్నపిల్లలు ఆడుకునే రూ.500 డమ్మీ నోట్లను కొన్నారు. ఇటీవల ఓ వృద్ధురాలు మంగళ్‌హాట్ పరిధిలో ఎస్‌బీఐ బ్యాంకులో నగదు డ్రా చేసుకుని వెళ్తుండగా ఆమెను అడ్డగించి బైక్‌పై తీసుకొని వెళ్తానని ఆమె చేతిలో ఉన్న బ్యాగ్‌ను లాక్కొని నకిలీ రూ.500ల నోట్లు అందులో ఉంచి అసలు నగదును దొంగిలించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని గురువారం అరెస్టు చేసి రూ. 20 వేల నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

## భక్తుల పాలిట కల్పవల్లి.. సింహవాహిని మహంకాళి

- 1909 ఆషాఢ మాసంలో మొదటిసారిగా అమ్మవారికి బోనాల సమర్పణ
- 1968లో అమ్మవారి విగ్రహం ఏర్పాటు
- నేటి నుంచి లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు ప్రారంభం
- లాల్‌దర్వాజా ఆలయంలో పది రోజుల పాటు ప్రత్యేక పూజలు
- 20న బోనాలు, 21న భవిష్యవాణి


మహంకాళి అమ్మవారు

చాంద్రాయణగుట్ట: కోరిన కోరికలు తీర్చుతూ భక్తుల పాలిట కల్పవల్లిగా పరిడవిల్లుతున్నారు లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారు. తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ప్రతి ఆషాఢ మాసంలో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ బోనాల ఉత్సవాలను తిలకించేందుకు తెలంగాణ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఈ ఆలయంలో పది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. శుక్రవారం జరిగే శిఖర పూజ, ధ్వజారోహణతో ప్రారంభమయ్యే ఈ పూజా కార్యక్రమాల్లో ఘట స్థాపన, శాకంబరి పూజ, తొట్టెల ఊరేగింపు, బలిహరణ, బోనం సమర్పణ, పట్టు వస్త్రాల సమర్పణ, రంగం, పోతరాజు గావు, ఘటం ఊరేగింపులు ప్రధానమైనవి. ఈ ఏడాది ఆలయంలో 117వ ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అంతా సిద్ధం చేశారు. ఈ నెల 20న బోనాలు, 21న భవిష్యవాణి (రంగం), ఊరేగింపు కార్యక్రమాలున్నాయి.

### వరద ముంపు నుంచి నగర ప్రజలను కాపాడిన అమ్మవారు...

అది 1908వ సంవత్సరం సెప్టెంబర్ మాసం. హైదరాబాద్ నగరానికి మూసీనది ఉగ్రరూపం దాల్చడంతో వరదలు భారీగా వచ్చి ఏకంగా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వరకు వరదనీరు చేరుకుంది. వరదలో అప్పటికే వేలాది మంది మృతి చెందడంతో నిజాం సంస్థానంలోని మంత్రి రాజా కిషన్ పర్షాద్ లాల్‌దర్వాజా అమ్మవారి మహత్యాన్ని నిజాం నవాబుకు వివరించారు. దీంతో నిజాం నవాబు బంగారు చాటలో కుంకుమ, పసుపు, మేలి ముత్యాలతో ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు చాట, కుంకుమ, పసుపు, మేలి ముత్యాలను తీసుకొని చార్మినార్ వద్దకు వచ్చిన వరద నీటిలో పూజలు చేసి వదిలిపెట్టారు. పూజలు చేసిన కొద్దిసేపటికే నగరంలో వరదనీరు తగ్గింది. అప్పటి నుంచి ఆలయంలో ఆషాఢ మాసంలో బోనాల పండుగను నిర్వహించడం ప్రారంభమైంది. 1909 ఆషాఢ మాసంలో మొదటిసారిగా అమ్మవారికి బోనాలను భక్తులు సమర్పించారు.


లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం

### 1968లో అమ్మవారి విగ్రహం..

ఈ ఆలయంలో 1968లో కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురువులు చంద్రశేఖర సరస్వతీ స్వామి వారి చేతుల మీదుగా అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పారు. అనంతరం ఆలయంలో 2008 ఏప్రిల్‌లో కంచికామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతీ చేతుల మీదుగా స్వర్ణ శిఖరం, అమ్మవారి రూపంలోని వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులెందరో..

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దేశంలోని ప్రముఖులెందరో దర్శించుకున్నారు. అందులో భారత మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, పి.వి.నరసింహారావు, మాజీ ముఖ్యమంత్రులు కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, నందమూరి తారక రామారావు, రోశయ్య, కేసీఆర్‌తో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శారద ముఖర్జీ, కుముద్‌బెన్ జోషి, రామేశ్వర్ ఠాకూర్‌తో పాటు సినీనటి విజయశాంతి, రోజా తదితరులున్నారు.

## సంత్ చేతన సదస్సు ప్రారంభం


జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

అబిడ్స్: ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో సంత్ చేతన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. మానవతావాద్‌కి ఆధ్యాత్మిక సామాజిక ఆధార్‌భూమి శీర్షికపై సదస్సును చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ హిందీ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సునిల్ బాబురావు కులకర్ణి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి డీకే.బరన్‌వాల్ ముఖ్యఅతిథులుగా హాజరై ఈ సదస్సును ప్రారంభించారు. సామాజిక జాగృతి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక చైతన్యం అంశాలపై ప్రసంగించారు. హిందీ అకాడమి డైరెక్టర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ ప్రపంచ శాంతి, పలు ఆధ్యాత్మికతలపై బోధనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సేవకే జీవితం అంకితం


ముజీబ్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. గురువారం ఆయన జన్మదిన వేడుకలను హైదరాబాద్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి సత్కారం చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..ప్రతినిత్యం అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వారి ప్రగతికి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నానన్నారు. ముజీబ్ హుస్సేని జన్మదిన వేడుకల సందర్భంగా టీఎన్జీఓస్ సంఘాల నాయకులతో పాటు ఆయన అభిమానులు, గురువారం నగరంలోని పలు ఆసుపత్రుల్లో పేషంట్లకు పండ్లు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. గాంధీభవన్ స్కూల్‌లో విద్యార్థులకు స్టేషనరీ, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. డీఈఓ కార్యాలయంలో విద్యాశాఖ టీఎన్జీఓ ఫోరం అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్, ఎం.భాస్కర్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

## నేటి నుంచి అక్కన్న మాదన్న మహంకాళి బోనాలు

యాకుత్‌పురా: హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 77వ వార్షిక బోనాల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ప్రభాకర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. నందా ముఖ్యఅతిథిగా హాజరై ధ్వజారోహణ చేసి ఉత్సవాలను ఘనంగా ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆలయంలో కలశ స్థాపన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఉదయం 11 గంటలకు అమ్మవారి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

## బల్కంపేట అమ్మవారికి బంగారు బోనం సమర్పణ

గోల్కొండ: బల్కంపేట అమ్మవారికి వంశపారపర్యంగా ప్రతి యేటా తాము బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని పోతులూరి వీరబ్రహ్మేంద్ర విశ్వకర్మ సేవా సమితి ప్రధాన సలహాదారులు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. గురువారం ఆయన సమితి సభ్యులతో కలిసి బల్కంపేట అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆయన వెంట సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, ఉపాధ్యక్షుడు సురేష్‌చారి శివచారి, మధులిక, మల్లేష్‌చారి, యాదగిరి ఉన్నారు.


బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న బి.సాయిబాబాచారి, శ్రీకాంత్ తదితరులు

## ‘గుప్పెడు గంధం’ కథా సంపుటి ఆవిష్కరణ


కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి

నాంపల్లి: గుప్పెడు గంధంలోని కథలన్నీ మానవీయ సుగంధ పరిమళాలు వెదజల్లుతాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలోని గాయత్రీ సదనంలో గురువారం రావుల పుల్లాచారి రచించిన ‘గుప్పెడు గంధం’కథా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేవీ రమణాచారి కథా సంపుటిని ఆవిష్కరించి ప్రసంగించారు. తెలంగాణ భాష, ఆత్మలను కథల రూపంలో పుల్లాచారి ఆవిష్కరించారని అభినందించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ..వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన పుల్లాచారి తన కథల సంపుటిని మరో రచయిత రమణకు అంకితం ఇవ్వడం సముచితంగా ఉందన్నారు. ప్రముఖ విమర్శకుడు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు, డాక్టర్ పులికొండ సుబ్బాచారి, దయానందచారి, డాక్టర్ మదన్ మోహన్ ఆచార్య పాల్గొన్నారు.

## మహేష్‌కుమార్ గౌడ్‌కు ఆహ్వానం


మహేష్‌కుమార్ గౌడ్‌కు బోనాల ఆహ్వాన పత్రం అందజేస్తున్న రాకేశ్ తివారీ

చార్మినార్: సుల్తాన్‌షాహీ జగదాంబ అమ్మవారి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి ఆహ్వాన పత్రాని అందజేశామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈసారి బోనాలను ఘనంగా నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 13న అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు నిర్వహించనున్నామన్నారు. ఆలయంలో ఘటాన్ని స్థాపించిన అనంతరం 20న అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు. 21న పాతబస్తీ వీధుల్లో అమ్మవారి ఘటాల పరిసమాప్తి సామూహిక ఊరేగింపును వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థి నాయకులుగా ఎంపికైన వారితో ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఉపాధ్యాయులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టర్ సెర్మనీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కొత్తగా ఎంపికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు చక్కటి క్రమశిక్షణ అలవర్చుకుంటే జీవితంలో తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, హైస్కూల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ ప్రైమరీ స్కూల్ కో ఆర్డినేటర్ ఫర్హానా, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మిక తదితరులు పాల్గొన్నారు.

## నేడు మీరాలంమండి మాతేశ్వరి ఘటం ఊరేగింపు


మాతేశ్వరి ఘటానికి స్వాగతం పలుకుతున్న గాజుల అంజయ్య(ఫైల్)

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో మాతేశ్వరి ఘటం ఊరేగింపు, ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయి. అలీజా కోట్లలోని కోట మైసమ్మ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాతేశ్వరి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీరాలంమండి ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించనున్నారు. చెర్నాకోలాలు పట్టుకొని పోతరాజులు నృత్యాలు చేస్తూ కనువిందు చేయనున్నారు. జానపద నృత్యాలతో అలీజా కోట్ల, ఎతేబార్ చౌక్, మీరాలంమండి తదితర ప్రాంతాలు మారుమోగనున్నాయి. ఈ వేడుకల సందర్భంగా దారి పొడవునా మాతేశ్వరి ఘటానికి స్థానికులు కొబ్బరికాయలు కొట్టి హారతులతో స్వాగతం పలకనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరకానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

## సంప్రదాయ వృత్తులను రక్షించాలి


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయ సంప్రదాయ వృత్తులను రక్షించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం కోరింది. ఈ మేరకు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రతినిధులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ..దేశ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన వడ్రంగి, కమ్మరి, ఇత్తడి శిలా శిల్పి, స్వర్ణకార వృత్తులు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వృత్తులపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలు ఆకలి చావులకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. 50 ఏళ్ల నుంచి ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు


వేడుకల్లో రాష్ట్ర బీజేపీ నాయకుడు అమర్ సింగ్


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న రాయికోటి బాబురాజా


గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గురువారం గురుపౌర్ణమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని సాయి మందిరాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజాము నుంచే విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేశారు. సాయంత్రం బాబాను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఊరేగించారు. పలు విద్యా సంస్థల్లో గురువులను సన్మానించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


దత్తాత్రేయ ఆలయంలో.. గ్రేటర్ బీజేపీ నాయకుడు గుర్రం కృష్ణ స్వామి


అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ శంకర్ యాదవ్ తదితరులు


సన్మాన గ్రహీతలతో ఓలేటి పార్వతీశం తదితరులు


తాళ్లగడ్డ కుమ్మర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


కార్వాన్ సరస్వతీ శిశుమందిర్‌లో..


గుడిమల్కాపూర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

### దత్తాత్రేయ ఆలయంలో..

జియాగూడ: గురు పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సాయిబాబా ఆలయాలు, దత్తాత్రేయ స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. సీతారాంబాగ్ దత్తాత్రేయ పహాడ్ భక్తులతో సందడిగా మారింది. తెల్లవారు జామున ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్రినాథ్ సింగ్, ఠాకూర్ గోపాల్ సింగ్ ప్రత్యేక పూజలు చేసి గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభించారు. దత్తాత్రేయ పహాడ్ ఆలయం వద్ద భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు ఠాకూర్ గోపాల్ సింగ్, బద్రినాథ్ సింగ్ తెలిపారు.


దత్తాత్రేయ ఆలయంలో పూజలు నిర్వహించిన ఠాకూర్ గోపాల్ సింగ్, బద్రినాథ్ సింగ్